


## లక్ష్యం ప్రజాసేవ..
## మార్గం మానవీయత

- శ్రీనివాస్ రెడ్డి స్ఫూర్తిదాయక ప్రస్థానం
- వ్యాపారవేత్తగా విజయం
- ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ తో సేవలు
- ఉద్యమకారుడిగా గుర్తింపు

7లో..


# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 05 | సంచిక : 041
పేజీలు : 08 | వెల: రూ.5/-
బుధవారం
జనవరి 21, 2026
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net

## పద్మశాలీల ఆరాధ్య దైవం శ్రీ భక్త మార్కండేయ

- ఘనంగా జయంతి వేడుకలు

8లో..



## ముఖా ముఖి

# తల్లుల రుణం తీర్చుకుంటున్నా..

మేడారంలో సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నా

వరంగల్ వాయిస్ తో కలెక్టర్ టీఎస్.దివాకర

2లో..





# అందం చూడవయా..!



పేరు గొప్ప ఊరు దిబ్బగా మారింది గ్రేటర్ వరంగల్ పరిస్థితి. స్మార్ట్ సిటీ, స్వచ్ఛ వరంగల్ అంటూ గొప్పలు చెప్పకుంటున్న బల్దియా పాలకవర్గానికి, అధికారులకు రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు చెంప పెట్టుగా పరిణమిస్తోంది. నగరంలోని అతి ముఖ్యమైన రహదారుల్లో ఒకటైన వరంగల్ చౌరస్తా నుంచి హెడ్ పోస్టాఫీస్ జంక్షన్ వరకు బుధవారం మురుగు నీరు రోడ్డుపై ప్రవహించడంతో ఇబ్బందులు తప్పలేదు. దీంతో వాహనదారులు, బాటసారులను ముక్కు మూసుకొని మురుగునీటిలోనే ముందుకు సాగాల్సి వచ్చింది. ఇదేదో ఈ ఒక్క రోజు జరిగింది కాదని, రెండు మూడు రోజులకు ఒకసారి ఇలాగే మురుగునీరు రోడ్డెక్కుతుందని దుకాణదారులు ఆరోపిస్తున్నారు. డ్రైనేజీ నిర్మాణ సమయంలో కాసులకు కక్కుర్తిపడి క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టకపోవడంతోనే ఈ పరిస్థితి దాపురించిందంటూ మండిపడుతున్నారు. స్మార్ట్ సిటీలో భాగంగా రహదారుల నిర్మాణ సమయంలోనే మురుగు కాలువలకు కొత్తగా పైప్ లైన్లు వేసినప్పటినుంచే ఇబ్బందులు మొదలయ్యాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితి ఒక్క వరంగల్ చౌరస్తాకే పరిమితం కాలేదంటున్నారు. మేదరివాడ, పాతబీట్ బజార్, జేపీఎన్ రోడ్డు, ఆర్ఎస్టీ రోడ్ తదితర ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొందని ఆరోపిస్తున్నారు. దీంతో అందం చూడవయా.. ఆనందించవయా అంటూ బల్దియా పనితీరును నగర వాసులు ఎండగడుతున్నారు. - వరంగల్ వాయిస్ ప్రతినిధి

- పేరు గొప్ప ఊరు దిబ్బగా మారిన గ్రేటర్ వరంగల్
- మురుగునీటి మయమైన చౌరస్తా
- రోడ్డుపైనే బురద కంపు
- ఇబ్బందులు పడుతున్న బాటసారులు



8లో..

## మోడ్రన్ స్టేషన్‌గా తీర్చిదిద్దాలి

- హనుమకొండ బస్టాండ్ ఆధునీకరణ పనులు చేపట్టాలి
- మంత్రి పొన్నంకు ఇనగాల వినతి



# తల్లుల రుణం తీర్చుకుంటున్నా..

- మేడారంలో సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నా
- వరంగల్ వాయిస్ తో కలెక్టర్ టీఎస్.దివాకర

**వరంగల్ వాయిస్, మేడారం :** ఆసియాలోనే అతిపెద్ద జాతరగా పేరుగాంచిన మేడారం సమ్మక్క సారలమ్మ జాతరలో తాము సేవలందించడం అదృష్టంగా భావిస్తున్నామని ములుగు జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర స్పష్టం చేశారు. వనదేవతలంటే తనకిష్టమని అందుకే వారి పట్ల అపార భక్తి, కృతజ్ఞతలు కనబరిచేందుకు తన వంతు సేవ చేస్తున్నానన్నారు. వరంగల్ వాయిస్ తో బుధవారం ఆయన మాట్లాడుతూ విశ్వంతర్యామి అయిన సమ్మక్క, సారలమ్మల సేవ చేయడం భాగ్యంగా భావిస్తున్నానన్నారు. గత మూడు నెలలుగా రేయింబవళ్లు కష్టపడి మేడారాన్ని చరిత్రలో నిలిచిపోయేలా ఆధునీకరించామని వెల్లడించారు. ఏ జన్మలో చేసుకున్న పుణ్యమో.. తనకు ఈ అవకాశం దక్కిందన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, ఏటూర్ నాగారం ఐటీడీఏ పీఓ చిత్రా మిశ్రాతో పాటు వివిధ శాఖల అధికారుల సహకారాలతో మేడారానికి అభివృద్ధి శోభను తీసుకొచ్చామన్నారు.

### వినూత్నంగా క్యూలైన్లు..


భక్తులకు ఇబ్బందులు లేకుండా తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో ఈసారి వినూత్నంగా క్యూలైన్లు ఏర్పాటు చేశామని వెల్లడించారు. వీఐపీలకు ప్రత్యేకంగా ఒక వరుసను ఏర్పాటు చేశామన్నారు. కూడళ్లను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించామని, దీంతో మేడారం విద్యుత్ వెలుగుల్లో కాంతులీనుతుందన్నారు. కుంభమేళాను తలపించేలా ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ టీఎస్ దివాకర తెలిపారు. రూ.251 కోట్లతో చేపట్టిన ఆధునీకరణ పనులు పూర్తి అయ్యాయని వెల్లడించారు. కనీసం రెండు శతాబ్దాలకుపైగా గుర్తుండిపోయేలా రాతి కట్టడాలతో ఆధునీకరణ పనులు పూర్తిచేశామని వివరించారు. జాతరకు రెండు కోట్ల మంది భక్తులకు పైగా హాజరు కానున్నట్లు అంచనా వేశామన్నారు. వారికి తాగు నీరు, రవాణా సౌకర్యం, వైద్య సౌకర్యాలతో పాటు మౌలిక వసతులు కల్పించినట్లు ఆయన తెలిపారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా శానిటేషన్, నీటి సరఫరాపై దృష్టి పెట్టామన్నారు. భక్తులకు అమ్మవార్ల దర్శనం సాఫీగా జరిగేలా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

### సమన్వయంతో విజయవంతం..

ఈనెల 28 నుంచి 31 వరకు జరిగే మేడారం మహా జాతరను విజయవంతం చేయాలని కలెక్టర్ దివాకర కోరారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ మహా జాతరను విజయవంతం చేయాలని కలెక్టర్ దివాకర విజ్ఞప్తి చేశారు. ఈ జాతర నిర్వహణకు భారీ స్థాయిలో అధికారులు, సిబ్బందిని కేటాయిస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన వెల్లడించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు మొత్తం 660 మంది అధికారులను విధుల్లోకి దించుతున్నామన్నారు. జోనల్, నోడల్ అధికారులు, వివిధ శాఖల అధికారులకు విధులు కేటాయించామన్నారు. జాతర ప్రాంగణాన్ని వివిధ సెక్టార్లుగా విభజించి, వాటి పర్యవేక్షణ కోసం 95 మంది ఉన్నత స్థాయి అధికారులను నియమించామన్నారు. జాతర తేదీలకు రెండు రోజుల ముందే అంటే జనవరి 26 నాటికే అధికారులు తమకు కేటాయించిన స్థానాల్లో రిపోర్ట్ చేయాలని, విధుల్లో ఏమాత్రం నిర్లక్ష్యం వహించిన కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ దివాకర హెచ్చరించారు.







### మేడారం మెరిసేలా..

మేడారం మెరిసేలా వనదేవతల గద్దెల ప్రాంగణం పునర్నిర్మాణ పనులు పూర్తి చేయించామని కలెక్టర్ టీఎస్.దివాకర వెల్లడించారు. భక్తుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా విశాలమైన రోడ్లు నిర్మించామన్నారు. మేడారంలో పలు జంక్షన్ లను బొమ్మలు, శిల్పాలతో అందంగా తీర్చిదిద్దామని తెలిపారు. ప్రత్యేక శిల్పాలు, జంతువుల బొమ్మలతో పాటు ఆదివాసీ సంస్కృతి ప్రతిబింబించేలా బొమ్మలు ఏర్పాట్లు చేశామన్నారు. ఆదివాసీ సంప్రదాయాలు, జీవన విధానం ప్రతిబింబించేలా బొమ్మల రూపకల్పనతో పాటు లైటింగ్, మొక్కలతో జంక్షన్ లను తీర్చిదిద్దామన్నారు. జిల్లాలోని తాడ్వాయి–ఏటూర్ నాగారం అభయారణ్యంలో ఏకో టూరిజం ఆధ్వర్యంలో పర్యాటకులను ఆకర్షించేలా అడవికి సరికొత్త అందాలను తీర్చిదిద్దామన్నారు. అటవీ మార్గంలో పర్యాటకులకు స్వాగతం పలుకుతూ ఆర్చితోపాటు, రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేసి కర్రలతో అలంకరించామన్నారు. అదేవిధంగా తాడ్వాయి–వస్త్ర మార్గంలోని దుర్గం గుట్టను పర్యాటక ప్రాంతంగా తీర్చి దిద్దామని, దీంతో భక్తులు దీనిని సందర్శించి అహ్లాదం పొందేలా ఏర్పాటు చేశామన్నారు. తాగునీటి వసతి, గుట్టపై నుంచి అడవులను తిలకించేందుకు మంచెలు నిర్మించామన్నారు. వీటితోపాటు తాడ్వాయి ఆర్చి అచ్చం అడవి జంతువుల మాదిరి బొమ్మలతో ఏర్పాటు చేశామన్నారు. తద్వారా మేడారం జాతరకు వచ్చే భక్తులు ఈ అటవీ అందాలను వీక్షించే అవకాశం కల్పించామని కలెక్టర్ టీఎస్.దివాకర వెల్లడించారు.













# కాంగ్రెస్‌కు ఓటుతోనే బుద్ధి చెప్పాలి

- గండ్ర దంపతుల పిలుపు
- రెండేళ్ల పాలనలో అభివృద్ధి శూన్యం



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** నమ్మి ఓట్లేసిన పాపానికి ప్రజలు నేడు కాంగ్రెస్ పాలనలో ఇబ్బందులు పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి విమర్శించారు. బుధవారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కటకం జనార్దన్ అధ్యక్షతన నిర్వహించిన 'బస్తీబాట' కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా భూపాలపల్లిలో ఒక్క కొత్త అభివృద్ధి పని కూడా జరగలేదని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తాము మంజూరు చేయించిన నిధులతోనే ఇప్పుడు మళ్లీ పునఃశంకుస్థాపనలు చేస్తూ కాలయాపన చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు కాలేదని దుయ్యబట్టారు. హైడ్రా పేరుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల ఇళ్లను కూలగొడుతున్నారని, రియల్ ఎస్టేట్ దందాలు చేసేవారికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని మండిపడ్డారు. బీరన్న గుడికి పది లక్షల నిధుల మంజూరు విషయంలో కాంగ్రెస్ అభ్యర్థి ఓడిపోతే పేపర్ చించుతానని అనడం వారి అహంకారానికి నిదర్శనమని విమర్శించారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలకు ప్రజలు తమ ఓటుతో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. "మేము అభివృద్ధి చేశాం.. అందుకే ధైర్యంగా ఓట్లు అడుగుతున్నాం" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, వార్డు కార్యకర్తలు, బస్తీ ప్రజలు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో నైన్‌పాక విద్యార్థుల ప్రతిభ



**వరంగల్ వాయిస్, చిట్యాల :** మండలంలోని నైన్‌పాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటారు. గత డిసెంబర్ 26, 27, 28 తేదీల్లో మెదక్ జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఈ పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించినట్లు ప్రధానోపాధ్యాయురాలు ఊర్మిళా రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ బండి ప్రసాద్ వెల్లడించారు. రాష్ట్రస్థాయిలో పాఠశాల పేరు నిలబెట్టిన వారిలో కొండ స్వేచ్ఛ, తొట్ల వాగ్దేవి, జంగపల్లి హనీ, పాలడుగుల మధుప్రియ, శ్రీపతి వర్షిత్, పాలడుగుల భరత్, గోనెల మధువర్య ఉన్నారు. పోటీల అనంతరం పాఠశాలకు చేరుకున్న విద్యార్థులకు మంగళవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ నక్క భాస్కర్, ఉప సర్పంచ్ గడ్డి రాములు ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు క్రీడల్లో రాణించడం గర్వకారణమని వారు కొనియాడారు. పాఠశాల ఉపాధ్యాయులు సుధాకర్, పల్లవి, ప్రవీణ్ కుమార్, రఘు, లోక శ్రీనివాస్, కోటేశ్వరరావు, రఘునాథ్, ఓదెలు, సీఆర్పీ తిరుపతి, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీని పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలి



**వరంగల్ వాయిస్, పరకాల :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ నడికూడ మండలం నర్సక్కపల్లి గ్రామసభ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. రాజ్యాంగం కల్పించిన పని చేసే హక్కుకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, వార్డు సభ్యులు కలిసి బుధవారం గ్రామ పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రజలకు పని కోరిన వెంటనే ఉపాధి కల్పించే చట్టబద్ధమైన హామీని కేంద్ర ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎంజీఎన్ఆర్ఈజీఏ స్వభావాన్ని దెబ్బతీయకుండా, పనుల ఎంపిక, ప్రణాళికా రచన బాధ్యతలను గ్రామ పంచాయతీలకే అప్పగించాలన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రజలకు నేరుగా ఉపాధి కల్పించకుండా, కాంట్రాక్టర్ వ్యవస్థను ప్రవేశపెట్టాలని చూడటం దురదృష్టకరమని విమర్శించారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజలంతా మూకుమ్మడిగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు కుమారస్వామి, వార్డు సభ్యులు నాగుల శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, రమణారెడ్డి, బుర్ర సురేందర్ గౌడ్, ముంజ రమా, సదయ్య, రఘు, శ్రీనివాస్, భద్ర, మల్లమ్మ, ప్రత్యూష,గ్రామస్తులు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో రాజీ పడొద్దు

- నాణ్యత పాటించకుంటే చర్యలు తప్పవు
- ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని, అవసరమున్న ప్రతి డివిజన్‌లో పార్టీలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తెలిపారు. బుధవారం 65వ డివిజన్ పరిధిలోని దేవన్నపేట గ్రామంలో సుమారు రూ.60 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు మేయర్ గుండు సుధారాణితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపడమే తన ధ్యేయమన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే ఎంతటి వారైనా సరే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేసి, పనులు సకాలంలో పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో సబ్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందిస్తూ.. త్వరలోనే సబ్ సెంటర్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గుగులోతు దివ్య, డివిజన్ అధ్యక్షుడు అయ్యాల రాజిరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు మల్లేశం, ఆత్మకూరు ఏఎంసీ వైస్ చైర్మన్ తంగెళ్లపల్లి తిరుపతి, హసన్ పర్తి మండల పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పోలేపాక అశోక్, మాట్ల విష్ణు, సునీల్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆవుల పవన్, బత్తుల స్వాతి, డివిజన్, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పద్మశాలీల ఆరాధ్య దైవం మార్కండేయుడు

**పోపా రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్**




**వరంగల్ వాయిస్, శివనగర్ :** వరంగల్ శివనగర్‌లో మార్కండేయ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. పద్మశాలి అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (పోపా) జిల్లా అధ్యక్షుడు గుండు కామేశ్వర్ అధ్యక్షతన బుధవారం ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కండేయ స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి భక్తిశ్రద్ధలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పోపా రాష్ట్ర అధ్యక్షులు శామంతుల శ్రీనివాస్ మాట్లాడుతూ మార్కండేయ మహర్షి పద్మశాలి వంశానికి మూలపురుషుడని కొనియాడారు. హిందువులకు మొదటి ఆరాధ్య దైవమైన మార్కండేయుడు, తన భక్తితో మృత్యువును సైతం గెలిచిన చిరంజీవి అని పేర్కొన్నారు. నేటి తరానికి ఆయన భక్తి, ముక్తి మార్గదర్శకమని, ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో పోపా ప్రతినిధులు గోషికొండ సుధాకర్, ధర్మపురి రాజగోవిందు, పెద్దురి పెద్దన్న, మాటేటి అశోక్, పద్మశాలి సంఘం నాయకులు, కుల బాంధవులు పాల్గొన్నారు.

# రేగొండ మండల కేంద్రంలో..



**వరంగల్ వాయిస్, రేగొండ:** మండల కేంద్రంలో పద్మశాలీల ఆరాధ్య దైవం శ్రీ భక్త మార్కండేయ స్వామి జయంతి వేడుకలు బుధవారం అత్యంత వైభవంగా జరిగాయి. పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు ఎలాగొండ రాజేంద్రప్రసాద్ ఆదేశాల మేరకు, మండల అధ్యక్షుడు మంతెన సతీష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి చిత్రపటానికి పూలమాలలు వేసి భక్తిశ్రద్ధలతో నివాళులర్పించారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథులుగా పాల్గొన్న కుల పెద్దలు నామల రమేష్, మాచర్ల స్వామి, మంతెన మొగిలి మాట్లాడుతూ.. మార్కండేయ మహర్షి తన అచంచలమైన శివ భక్తితో మృత్యువును సైతం ఎదిరించి చిరంజీవిగా నిలిచారని కొనియాడారు. బ్రనేటి తరం మార్కండేయ స్వామిని స్ఫూర్తిగా తీసుకుని, పట్టుదలతో జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని భక్తులకు, కుల సంఘం నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం ప్రతినిధులు, భక్తులు, కుల బాంధవులు పాల్గొన్నారు.

# క్యాలెండర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, రేగొండ :** మండల కేంద్రంలో పద్మశాలి సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం ఘనంగా ఆవిష్కరించారు. కుల పెద్ద నామాల రమేష్ నివాసంలో, మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు మంతెన సతీష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రేగొండ మండల ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ఎల్దండి నరేష్ ముఖ్య అతిథిగా హాజరై క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎల్దండి నరేష్ మాట్లాడుతూ.. పద్మశాలి కులస్థుల హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం నుంచి అందే సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి కుల సభ్యునికి చేరేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన బీసీ సామాజిక వర్గ ప్రతినిధులకు, పద్మశాలి కుటుంబ సభ్యులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ క్యాలెండర్ ఆవిష్కరణలో పద్మశాలి సంఘం నాయకులు కటకం రాజు, మంతెన సంపత్, మధుకర్, మాచర్ల లింగమూర్తి, కటకం సంపత్, బత్తుల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# కాజీపేట ఆర్ఓబీ పనులను వేగవంతం చేయండి

■ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, కాజీపేట :** కాజీపేట ఫాతిమా నగర్ వద్ద నిర్మాణంలో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ) పనులను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి బుధవారం సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిపై రోడ్లు భవనాల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్న ఆయన, గడువులోగా పనులు పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరకు వచ్చే భక్తుల రవాణా సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని, ఈ ఆర్ఓబీ పనుల కోసం నిధులను సత్వరమే మంజూరు చేయించామని తెలిపారు. ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ, కొన్ని అనివార్య సాంకేతిక కారణాల వల్ల పనుల్లో కొంత జాప్యం జరిగిందని ఆయన వివరించారు. బ్రిడ్జి నిర్మాణం ప్రధానంగా రైల్వే శాఖ పరిధిలో ఉండటం, భారీ యంత్రసామగ్రిని ఇతర రాష్ట్రాల నుంచి తరలించాల్సి రావడం వల్ల ఆలస్యం చోటు చేసుకున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. అయినప్పటికీ, రైల్వే అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ అడ్డంకులను తొలగిస్తున్నామని, అతి త్వరలోనే పనులు పూర్తి చేసి వంతెనను ప్రజలకు అందుబాటులోకి తెస్తామని ధీమా వ్యక్తం చేశారు. నగరంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేలందరం సమిష్టిగా కృషి చేస్తున్నామని నాయిని తెలిపారు. ఇప్పటికే ఎన్ఐటీ నుంచి హంటర్ రోడ్డు వరకు రోడ్డు వెడల్పు పనులు ప్రారంభించామని, నగర నలువైపులా ఉన్న బ్రిడ్జిల పనులను వేగవంతం చేసి ప్రయాణ కష్టాలను తొలగిస్తామని హామీ ఇచ్చారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సమర్థవంతమైన రవాణా ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 'వరంగల్ వాయిస్' క్యాలెండర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, శాయంపేట :** ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా నిలుస్తూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో 'వరంగల్ వాయిస్' పత్రిక అద్భుతమైన కృషి చేస్తోందని మినిమం వేజ్ బోర్డ్ డైరెక్టర్, మాజీ ఎంపీపీ బాసని చంద్రప్రకాష్ కొనియాడారు. బుధవారం మండల కేంద్రంలోని శ్రీ శివ మార్కండేయ ఆలయ ప్రాంగణంలో 'వరంగల్ వాయిస్' 2026 నూతన క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రప్రకాష్ మాట్లాడుతూ.. సామాజిక న్యాయం కోసం పోరాడటంలోనూ, ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలోనూ ఈ పత్రిక ఎల్లప్పుడూ ముందుంటోందని ప్రశంసించారు. ప్రజలకు నిరంతరం నాణ్యమైన వార్తలను అందిస్తున్న పత్రికా బృందానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో పత్రిక ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం మాజీ మండల అధ్యక్షుడు బాసని లక్ష్మీనారాయణ, బాసని రాజు, దుబాసి రవి, దిండిగల రమేష్, బాసని వెంకటపతి తదితరులు పాల్గొన్నారు.

## సమ్మక్క–సారలమ్మ ధ్వజస్తంభ ప్రతిష్ట



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** మండల కేంద్రమైన కమలాపూర్‌లో రాబోయే సమ్మక్క–సారలమ్మ జాతరను పురస్కరించుకుని బుధవారం ధ్వజస్తంభాల ప్రతిష్టా కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్ శనిగరపు సమ్మయ్య బహుకరించిన నూతన ధ్వజస్తంభాలను మేడారం వడ్డే పూజారుల ఆధ్వర్యంలో జాతర గద్దెల వద్ద ప్రతిష్టించారు. జాతర చైర్మన్ చేరాల రోహిత్ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తొలుత గ్రామంలోని పలు దేవాలయాల్లో ధ్వజస్తంభాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మేడారం ఆచారాల ప్రకారం వడ్డే పూజారుల వేదమంత్రాల మధ్య గద్దెల వద్ద పునర్నిర్మాణ పనులను పూర్తి చేసి ధ్వజస్తంభాలను ప్రతిష్టించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీ రాణి రవీందర్ పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో బాలసాని రమేష్ గౌడ్, సర్పంచ్ పబ్బు సతీష్, ఉపసర్పంచ్ పుల్ల శ్రీనివాస్, మౌటం బాలాజీ, మౌటం రమేష్, పెరుమాండ్ల పరుశురాములు, చందుపట్ల నరసింహారెడ్డి, పోడేటి బిక్షపతి, విష్ణుదాసు వంశీధర్ రావు, జనగాని శివకృష్ణ, ఆన్ కార్ అశోక్ జి, ఆడెపు విజయ, కోల్గూరి కుమార్, ఆడెపు శ్రీకాంత్, మొగిలిచర్ల శ్రీనివాస్, వైనాల వంశీ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట

సర్పంచ్ పెంచాల స్వరూప



**వరంగల్ వాయిస్, దామెర:** మండలంలోని పులుకుర్తి గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం అత్యంత ఉత్సాహంగా జరిగింది. గ్రామ సర్పంచ్ పెంచాల స్వరూప ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు మహిళలకు చీరలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని, అందులో భాగంగానే ఈ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలోని అర్హులైన మహిళలందరికీ ప్రభుత్వ ఫలాలు అందేలా కృషి చేస్తామన్నారు. తమకు అందజేసిన చీరల నాణ్యత పట్ల మహిళలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి శీను, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు పెంచాల రాజేందర్ (రాజు), మండల ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, నాయకులు అశోక్, ఆనంద్, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

## జిల్లాలో ప్రశాంతంగా ఇంటర్ ఇంగ్లీష్ ప్రాక్టికల్స్

98 శాతం విద్యార్థుల హాజరు

వెల్లడించిన డీఐఈఓ ఏ.గోపాల్



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** జిల్లా వ్యాప్తంగా బుధవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో జనరల్, ఒకేషనల్ కోర్సుల విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహించినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఏ.గోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా జనరల్ విభాగంలో మొత్తం 17,482 మంది విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించగా.. వారిలో 17,251 (97%) మంది పరీక్షకు హాజరయ్యారు. 231 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సుల్లో 1,145 మంది విద్యార్థులకు గాను 1,041 (91%) మంది హాజరుకాగా, 104 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లా మొత్తం మీద జనరల్, ఒకేషనల్ విభాగాల్లో కలిపి సగటున 98 శాతం మంది విద్యార్థులు ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్షకు హాజరైనట్లు విద్యాధికారి వివరించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, నిబంధనల ప్రకారం పరీక్షలు విజయవంతంగా పూర్తయ్యాయని ఆయన పేర్కొన్నారు.

## ప్రతిభకు పేదరికం అడ్డుకాదు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశానుసారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం 'స్ఫూర్తి' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో సామాజిక స్పృహ, క్రమశిక్షణ పెంపొందించడమే లక్ష్యంగా జరిగిన ఈ సమావేశానికి మండల తహసీల్దార్ టి.వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్న వయసులోనే మత్తు పదార్థాలు, పొగాకు వంటి చెడు వ్యసనాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. "ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిభ గల పిడుగులు.. పేదరికం మీ ఎదుగుదలకు అడ్డుకాకూడదు" అని ఆయన విద్యార్థుల్లో ధైర్యాన్ని నింపారు. కష్టపడి చదివి సమాజంలో ఉన్నత స్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు. మండల విద్యాశాఖ అధికారి భిక్షపతి మాట్లాడుతూ.. విద్యార్థులు బాల్యం నుంచే క్రమశిక్షణను అలవర్చుకోవాలని, చదువుతో పాటు జీవన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు పాక రమేష్ బాబు, ఉపాధ్యాయులు కె.శ్రీధర్, వి.పరశురాములు, ఏ.మనోహర్, ఆర్.అశోక్, బి.తిరుపతి, ఏ.తిరుమల, డి.రాధాకృష్ణకుమారి, డాక్టర్ ఎం.రాజలక్ష్మి, కె.మౌనిక, ఐ.రమేష్ బాబు, జి.ప్రశాంత్, డి.రవికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

# క్యాబ్ డ్రైవర్లకు 'ఇందిరమ్మ' కష్టం..

◆ కారు ఉంటే ఇల్లు లేనట్టేనా?

◆ దళితబంధు లబ్ధిదారులకు కొత్త చిక్కులు

◆ ఉపాధికి, విలాసానికి తేడా లేదా అని బాధితుల ప్రశ్న



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ ఇండ్ల' పథకం మంజూరులో క్యాబ్ డ్రైవర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో దళితబంధు పథకం ద్వారా లేదా స్వయంగా అప్పులు చేసి ఉపాధి కోసం కారు కొనుక్కున్న వారిని 'అనర్హులు'గా ముద్ర వేస్తుండటంతో వేలాది మంది నిరుపేద కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. లబ్ధిదారుడి పేరు మీద కారు ఉంటే వారు ఆర్థికంగా స్థితిమంతులని, కాబట్టి వారు ఇందిరమ్మ ఇళ్లకు అనర్హులని ప్రభుత్వం నిబంధనలు విధించింది. క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్న అధికారులు.. దరఖాస్తుదారుడి పేరిట కారు రిజిస్ట్రేషన్ అయి ఉండటాన్ని గమనించి, వారి దరఖాస్తులను ప్రత్యేక జాబితాలో చేరుస్తున్నారు.

### జీవనోపాధిని విలాసంగా చూస్తారా?..

"సొంత అవసరాల కోసం కారు కొనడం వేరు, పొట్టకూటి కోసం కారు కొనడం వేరు" అని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దళితబంధు కింద ప్రభుత్వం ఇచ్చిన కారు కేవలం తమ జీవనోపాధి కోసమేనని, ఇప్పటికీ తాము అద్దె ఇళ్లలోనే ఉంటూ ఇబ్బందులు పడుతున్నామని డ్రైవర్లు వాపోతున్నారు. ఉపాధి కోసం కారు ఉంటే అది ఆస్తి ఎలా అవుతుంది? అద్దె ఇంట్లో ఉంటూ కారు నడుపుకునే తమకు సొంత ఇంటి కల నెరవేరదా? ఈ నిబంధన ముందే తెలిస్తే ఆశలు పెట్టుకునే వాళ్లం కాదు కదా!

### అయోమయంలో వేలాది మంది..

హనుమకొండ జిల్లాతో పాటు ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా వందలాది మంది క్యాబ్ డ్రైవర్లు ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం ఈ నిబంధనను సవరించి, ఉపాధి కోసం కారు కొనుక్కున్న వారిని మానవతా దృక్పథంతో ఆదుకోవాలని, వారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని డ్రైవర్ల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలి

◆ పద్మశాలి సంఘం నేతల పిలుపు

**వరంగల్ వాయిస్, హనుమకొండ (కొత్తూరు) :** కొత్తూరు పద్మశాలి పరపతి సంఘం, పద్మశాలి యువజన సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ శివ భక్త మార్కండేయ మహర్షి జయంతి ఉత్సవాలను బుధవారం స్థానిక పోచమ్మ ఆలయంలో ఘనంగా నిర్వహించారు. సంఘం ప్రధాన కార్యదర్శి బింగి శ్రీనివాస్ శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించగా, మార్కండేయ మహర్షి చిత్రపటాన్ని పుష్పమాలలతో అలంకరించి, మంత్రోచ్ఛరణల మధ్య భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. మృకుండ మహర్షి – మరుద్వతి దంపతుల కుమారుడైన మార్కండేయుడు, తన అచంచలమైన శివభక్తితో యముడిని సైతం జయించి చిరంజీవిత్వాన్ని పొందిన మహనీయుడని కొనియాడారు. అటువంటి సద్గుణ సంపన్నుడైన మార్కండేయుని వంశీయులైన పద్మశాలీలు, తమ చేనేత వృత్తి ద్వారా ప్రపంచానికే వస్త్రాన్ని అందించి 'మాన సంరక్షకులు'గా నిలిచారని గుర్తుచేశారు. లోక కల్యాణం కోసం, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఈ పూజలు నిర్వహించినట్లు తెలిపారు. పద్మశాలీలు ప్రస్తుతం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతున్నారని, అయితే రాజకీయంగా ఇంకా వెనుకబడే



ఉన్నారని నేతలు అభిప్రాయపడ్డారు. రాబోయే రోజుల్లో మార్కండేయ మహర్షి ఆశీస్సులతో పద్మశాలీలు రాజకీయ రంగంలో కూడా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి పరపతి సంఘం అధ్యక్షులు తౌటం విజేందర్, ప్రధాన కార్యదర్శి బింగి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు చిప్ప మురళి, బింగి చంద్రశేఖర్, పాశికంటి సుధాకర్, రామ వెంకటయ్య పాల్గొన్నారు. అలాగే సంయుక్త కార్యదర్శులు బింగి సురేష్, తౌటం శివాజీ, మాటేటి సూర్యనారాయణ, యువజన సంఘం అధ్యక్షులు తౌటం సంతోష్, అసోసియేట్ అధ్యక్షుడు పాశికంటి శ్రవణ్, కోశాధికారి బింగి సుకుమార్, ఉపాధ్యక్షుడు గుండు శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా భక్త మార్కండేయ జయంతి ఉత్సవాలు



**వరంగల్ వాయిస్, రామన్నపేట :** మండలంలోని సోమిరెడ్డి గ్రామంలో వెలసిన శ్రీ భక్త మార్కండేయ దేవాలయంలో బుధవారం మార్కండేయ మహర్షి జయంతి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా రామన్నపేటలోని డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్న కమిటీ సభ్యులను మరియు పురోహితులను ఘనంగా సన్మానించారు. కృష్ణశాస్త్రి, బింగి రమేష్ ఆచార్య, పురోహితుల బృందం ఆధ్వర్యంలో మార్కండేయ స్వామికి ప్రత్యేక అభిషేకాలు, శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణతో పాటు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా భారతి ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ మాట్లాడుతూ.. ప్రజల, పెద్దల సహకారంతో ఈ దేవాలయాన్ని అత్యంత వైభవంగా నిర్మించి, నిత్య పూజలతో ఆధ్యాత్మికతను వెల్లివిరియజేయడం అభినందనీయమని కొనియాడారు. సన్మానం పొందిన వారిలో ఆలయ కమిటీ అధ్యక్షులు గుర్రప్ప కోటేశ్వర్, ఉపాధ్యక్షులు తుమ్మ శ్రీనివాస్, కోశాధికారి గుర్రపు చంద్రశేఖర్, హనుమకొండ పద్మ బ్రాహ్మణ సంఘ అధ్యక్షులు కృష్ణశాస్త్రి ఉన్నారు. జయంతి ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం మార్కండేయ స్వామి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామం నుంచి హనుమకొండలోని చారిత్రాత్మక వేయి స్తంభాల గుడి వరకు ఈ శోభాయాత్ర అత్యంత వైభవంగా సాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులతో పాటు సంఘ సభ్యులు డి.రవీందర్, వి రాజానంద, మురళీమోహన్, సదానందం,భక్తులు పాల్గొన్నారు.

# హసన్‌పర్తిలో భక్తి శ్రద్ధలతో మార్కండేయ జయంతి



**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి:** మండల కేంద్రంలోని శ్రీ మార్కండేయ దేవాలయంలో పద్మశాలి కులదైవం మార్కండేయ మహర్షి జయంతి ఉత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా జరిగాయి. పద్మశాలి అభివృద్ధి కమిటీ, దేవాలయ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పద్మశాలి కుల సంఘం నేతలు మార్కండేయ స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పురోహితుడు భద్రదేవ్ వీరికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం కేదాసి రాకేశ్, సట్కూరి సంతోష్ కలిసి ఆలయ ధ్వజస్తంభం వద్ద మార్కండేయ జెండాను ఆవిష్కరించారు. ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి పంచామృత అభిషేకము, గణపతి పూజ, కలశ పూజ, అష్టోత్తరము, మహా హారతి వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నేతలు గడ్డం దామోదర్, చెన్నూరి కిరణ్, కేదాసి వేంకన్న, చేరాల రవీందర్, పి.శ్రీకాంత్, పద్మశాలి కుల బాంధవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా మార్కండేయ జయంతి వేడుకలు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్థానిక హంటర్ రోడ్‌లోని బీసీ నేత హాస్టల్‌లో బుధవారం పద్మశాలి కులదైవం శ్రీ మార్కండేయ మహర్షి జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం, తెలంగాణ పద్మశాలి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మార్కండేయ స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మార్కండేయుడు చూపిన ధర్మ మార్గంలో పద్మశాలి ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. కుల బాంధవులందరూ ఐక్యంగా ఉండి సంక్షేమ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. ఈ వేడుకల్లో పద్మశాలి ఉద్యోగుల సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు కోడం రవిప్రకాష్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు బిట్ల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి గుండు



కామేశ్వర్ పాల్గొన్నారు. కార్యవర్గ సభ్యులు కొండబత్తుల రాజమౌళి, దేవులపల్లి సాయిరాజ్, బూర తిరుపతయ్య, గుర్రపు సుధాకర్ రావు, చిమ్మని రాజన్ బాబు, గజ్జెల్లి రవీందర్, గుండా నర్సింహా మూర్తి, ఆముదల భాస్కర్, వడ్నాల నగేష్, వంగరి కోటేశ్వర్ రావు, స్వర్గం చంద్రశేఖర్, రామ నరేందర్, వి.పూర్ణచందర్ రావు, ఆర్ బాలరాజు, మ్యాన వాణిశ్రీ, పెద్దురి పెద్దన్న, పెంట భిక్షపతి, గడ్డం రాజ్ కుమార్, రామ దీపక్, కందగట్ల ప్రసాద్, గోసికొండ సుధాకర్ తదితరులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# భక్త మార్కండేయుడు ఆదర్శప్రాయుడు

## సామాజిక వేత్త నిమ్మల శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భారతీయ ఆధ్యాత్మిక చరిత్రలో భక్త మార్కండేయుడు చిరస్మరణీయమైన పేరు అని, ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని హనుమకొండ సాయిబాబా మందిర ధర్మకర్త నిమ్మల శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం భక్త మార్కండేయుడి జయంతిని పురస్కరించుకుని ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ చిన్న వయసులోనే అపారమైన భక్తి, ధైర్యం, ధర్మబద్ధమైన జీవితంతో మార్కండేయుడు మృత్యువునే జయించిన మహనీయుడని కొనియాడారు. భక్తికి మించిన బలం లేదని నిరూపించిన గొప్ప చరిత్ర ఆయనదని తెలిపారు. అల్పాయుష్షు అని తెలిసినా భయపడకుండా, శివుడిపై సంపూర్ణ విశ్వాసంతో ధ్యానం చేసి చిరంజీవిత్వాన్ని పొందిన ఘనత మార్కండేయుడిది. యమధర్మరాజు ప్రాణాలు తీయడానికి వచ్చిన వేళ, శివలింగాన్ని ఆలింగనం చేసుకున్న మార్కండేయుడిని రక్షించేందుకు సాక్షాత్తు పరమశివుడే ప్రత్యక్షమై యముడిని జయించడం భక్తి యొక్క శక్తికి నిదర్శనం. సత్యం, సేవ, వినయం వంటి విలువలతో మార్కండేయుడు చూపిన బాట మనందరికీ మార్గదర్శకం. "సమస్యలు ఎంత పెద్దవైనా, అచంచలమైన విశ్వాసం, భక్తి ఉంటే వాటిని అధిగమించవచ్చు. మార్కండేయుడి జయంతి సందర్భంగా ఆయన చూపిన భక్తి, ధర్మం, మానవత్వం కలిసిన మార్గంలో మనమందరం నడవాలి" అని నిమ్మల శ్రీనివాస్ కోరారు.

## కమలాపూర్‌లో..



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** మండల కేంద్రంలో భక్త మార్కండేయ జయంతి వేడుకలను పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల పద్మశాలి సంఘం అధ్యక్షులు బొప్ప శివశంకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీ రాణి రవీందర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ మార్కండేయ స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పద్మశాలిల ఆరాధ్య దైవమైన మార్కండేయుడు చూపిన భక్తి మార్గం, ధర్మ మార్గం అందరికీ ఆదర్శమని ఆమె పేర్కొన్నారు. పద్మశాలి కులస్తులు, చేనేత కార్మికులు ఐక్యంగా ఉండి సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం పద్మశాలి సంఘం ప్రతినిధులు ఒక ముఖ్య నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ ఉద్యమ నేత, నిరుపేదల ఆశాజ్యోతి స్వర్గీయ కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని కమలాపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఈ నిర్ణయం పట్ల స్థానిక పద్మశాలి కులస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దాసి సాంబయ్య, తుమ్మ శోభన్ బాబు, పోరండ్ల రమేష్, కనుకుంట్ల అరవింద్, మిట్టపల్లి ప్రభాకర్, గాజుల సతీష్, పులికంటి ప్రభాకర్, దాసి శంకరయ్య, పోరండ్ల కుమారస్వామి, మెండు రమేష్, చేరాల సారంగం తదితర పద్మశాలి కులస్తులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

## శాయంపేటలో ..



**వరంగల్ వాయిస్, శాయంపేట:** మండల కేంద్రంలోని శ్రీ శివ మార్కండేయ ఆలయంలో బుధవారం పద్మశాలి కుల బాంధవుల ఆరాధ్య దైవమైన మార్కండేయ మహర్షి జయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. మాజీ ఎంపీపీ బాసని చంద్రప్రకాష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవాల్లో పద్మశాలి కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుకల్లో పద్మశాలి ప్రముఖులు బాసని లక్ష్మీనారాయణ, బాసని వెంకటేశ్వర్లు, బాసని వెంకటపతి, బాసని రాజు, దుబాసి రవి, బాసని సదాశివుడు, కుల బాంధవులు పాల్గొన్నారు.

# అభివృద్ధిని పాతరేసిన బీఆర్ఎస్, కాంగ్రెస్

### ◆ డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు



**వరంగల్ వాయిస్, పరకాల:** పరకాల పట్టణ అభివృద్ధిని గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యం చేశాయని బీజేపీ రాష్ట్ర నాయకులు, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు విమర్శించారు. పట్టణంలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం పాత మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో కాళీ ప్రసాద్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా డాక్టర్ కాళీ ప్రసాద్ రావు మాట్లాడుతూ.. పరకాల ప్రజలను రెండు పార్టీలు మోసం చేశాయని మండిపడ్డారు. “గతంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కేవలం కమీషన్ల కోసమే పనులు ప్రారంభించగా, ఇప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి కమీషన్లు రావనే సాకుతో పనులను గాలికొదిలేశారు” అని ఆరోపించారు. పట్టణంలో వ్యాపారాలు దెబ్బతిని, దుకాణాలకు ‘టూ లెట్’ బోర్డులు వెలుస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త జిల్లాల పునరుద్ధరణ నేపథ్యంలో పరకాలను ‘అమరవీరుల జిల్లా’గా ప్రకటించాలని, ఇక్కడకు మెడికల్ కాలేజీని తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. “ఒకవేళ పరకాల జిల్లా కోసం రేవూరి ప్రకాశ్ రెడ్డి రాజీనామా చేస్తే, మేమే స్వయంగా మద్దతు ఇచ్చి గెలిపిస్తాం” అని సవాల్ విసిరారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్, స్కూల్ వంటి హామీలు నేటికీ కాగితాలకే పరిమితమయ్యాయని ఎద్దేవా చేశారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో 22 వార్డుల్లో బీజేపీని గెలిపిస్తే పరకాలను మోడల్ పట్టణంగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉందని, ఢిల్లీ స్థాయిలో పోరాడి అయినా నిధులు తీసుకువస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్, కాచం గురు ప్రసాద్, చందుపట్ల రాజేందర్ రెడ్డి, ఆర్పి జయంత్ లాల్, దేవునూరి మేఘనాథ్, కొలనుపాక భద్రయ్య, బెజ్జంకి పూర్ణచారి, ఎర్ర రామన్న, సంఘ పురుషోత్తం, దగ్గు విజేందర్ రావు, కుక్కల విజయ్, బాసాని సోమరాజు, రూరల్ అధ్యక్షుడు కాసగాని రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీడీవోగా రవీందర్ బాధ్యతల స్వీకరణ



**వరంగల్ వాయిస్, పరకాల:** మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా రవీందర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యాలయ సిబ్బంది, వివిధ సంఘాల నాయకులు సాదర స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం, రవీందర్ ని తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందు నవీన్ కుమార్, కార్యాలయ సిబ్బంది శాలువాతో ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకులు శైలశ్రీ, ఏఈ శ్రీలత, ఈసీ రజనీకాంత్, టైపిస్ట్ మసూద్ అలీ, జూనియర్ సహాయకులు ప్రియాంక, శ్రీలక్ష్మి, కార్యాలయ సహాయకులు వరుణ్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ పై సస్పెన్షన్ ఎత్తివేయాలి

### డాక్టర్ తిరునహరి శేషు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఉస్మానియా విశ్వవిద్యాలయం టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ మనోహర్ పై విధించిన సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని బీసీ జాక్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రికి ఒక బహిరంగ లేఖ రాశారు. బలహీన వర్గాలకు చెందిన ఒక విద్యావేత్తపై, సంఘం నాయకుడిపై కక్షసాధింపు చర్యలకు దిగడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. విశ్వవిద్యాలయంలో పనిచేసే అధ్యాపకులకు ‘కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్’లో తీవ్ర అన్యాయం జరిగిందని, దానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలపడం నేరమా అని డాక్టర్ శేషు నిలదీశారు. ప్రొఫెసర్ మనోహర్ తన హక్కుల కోసం పోరాడినందుకు విశ్వవిద్యాలయ అధికారులు ఆయనపై సస్పెన్షన్ వేటు వేయడాన్ని తీవ్రంగా ఖండించారు. బలహీన వర్గాల నాయకులను అణచివేసే ధోరణిని వీడాలని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ విషయంలో జోక్యం చేసుకొని ప్రొఫెసర్ మనోహర్ పై ఉన్న సస్పెన్షన్ ఉత్తర్వులను రద్దు చేయాలని డాక్టర్ తిరునహరి శేషు డిమాండ్ చేశారు.

# పరకాలలో ‘గులాబీ’ జెండా ఎగరాలి

### మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల:** రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పరకాల గడ్డపై గులాబీ జెండా ఎగరడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం పరకాల పట్టణంలోని 4వ, 16వ వార్డులకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి చల్లా ధర్మారెడ్డి సమక్షంలో భారత రాష్ట్ర సమితిలో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి చల్లా సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, ఆ పార్టీలో ఇమడలేక అభివృద్ధి కోసం బీఆర్ఎస్‌లో చేరడం అభినందనీయమన్నారు. “బీఆర్ఎస్ తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక. పరకాల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా అందరం కలిసికట్టుగా పోరాడదాం” అని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నాయకత్వ లోపం, స్థానిక సమస్యల పట్ల వారి నిర్లక్ష్య వైఖరి వల్లే ఆ పార్టీ ఖాళీ అవుతోందని విమర్శించారు. కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వారిలో ఏకు రమేష్, మోరే రాజకుమార్, గోవిందు రాజేందర్, మోరే సారంగపాణి, బొచ్చు దేవరాజు, గోవింద రాజు, పసుల పవన్ కళ్యాణ్, కోగిల శ్రీకాంత్, గోవింద అజయ్, నిశాంత్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, యూత్ విభాగం సభ్యులు పాల్గొన్నారు.

# పద్మశాలీలు ఆర్థికంగా ఎదగాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** కేయూ రోడ్డులోని పద్మశాలి కమ్యూనిటీ హాల్, పరపతి సంఘం కార్యాలయంలో బుధవారం శ్రీ మార్కండేయ మహర్షి జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్‌ను సభ్యులు ఆవిష్కరించారు. పద్మశాలి పరపతి సంఘం అధ్యక్షుడు దేవులపల్లి సదానందం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మార్కండేయ స్వామి చిత్రపటానికి పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కులదైవం మార్కండేయుని ఆశీస్సులతో పద్మశాలీలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని ఆకాంక్షించారు. పరపతి సంఘం ద్వారా కుల బాంధవులకు అందిస్తున్న సేవలను వివరించారు. ఈ క్యాలెండర్ ప్రతి పద్మశాలి ఇంట్లో ఉండాలని, ఇది మన ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి గజ్జెల అమరేందర్, ఉపాధ్యక్షులు దుంపేటి కోటయ్య, డైరెక్టర్ బండారి ప్రభాకర్, పరశురాములు, పద్మశాలి కుల బాంధవులు పాల్గొన్నారు.

# పులుకుర్తిలో వీధి కుక్కల స్వైరవిహారం

### నలుగురి గ్రామస్తులపై దాడి



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని పులుకుర్తి గ్రామంలో వీధి కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతోంది. గ్రామంలోని ప్రధాన వీధులు, పాఠశాల పరిసర ప్రాంతాల్లో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ పాదచారులపై దాడులకు తెగబడుతున్నాయి. దీంతో గ్రామస్థులు బయటకు రావాలంటేనే భయం గుప్పిట్లో గడుపుతున్నారు. బుధవారం కుక్కల దాడిలో నలుగురు గ్రామస్తులు గాయపడ్డారు. ముఖ్యం, మెడ, చేతులు, కాళ్లపై రక్కడంతో వారికి తీవ్రంగా రక్త స్రావంతో పాటు గాయాలయ్యాయి. ఈ సంఘటనపై గ్రామస్తులు మాట్లాడుతూ రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారిని కుక్కలు వెంబడిస్తుండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీధి కుక్కల సమస్యపై పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం, మండల అధికారులు స్పందించి పులుకుర్తిలో కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని, వాటికి సంతాన సాఫల్య ఆపరేషన్లు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు.





# ల్యాండ్ పూలింగ్ తో ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి

### • కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** హనుమకొండ జిల్లా పరిధిలో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన ల్యాండ్ పూలింగ్ ప్రక్రియకు భూ యజమానుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. వివిధ మండలాలకు చెందిన రైతులు తమ 130 ఎకరాల భూములను అభివృద్ధి చేసేందుకు ముందుకు రాగా, అందులో ఆత్మకూరు మండలానికి చెందిన భూ యజమానులు తమ 21.5 ఎకరాల భూమికి సంబంధించి కుడాతో డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ సందర్భంగా కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి, వైస్ చైర్మన్ చాహత్ బాజపాయి భూ యజమానులను ప్రత్యేకంగా అభినందించారు. భూ యజమానుల భాగస్వామ్యంతో త్వరలోనే లేఅవుట్ అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని వారు హామీ ఇచ్చారు. ప్రస్తుత రియల్ ఎస్టేట్ మార్కెట్ పరిస్థితుల దృష్ట్యా, ప్లాట్లు వేయాలనుకునే ఆసక్తి గల భూ యజమానులు కుడాను సంప్రదిస్తే.. వరంగల్, హనుమకొండ జిల్లాల్లో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ప్రణాళికాబద్ధమైన మోడల్ లేఅవుట్‌లను అభివృద్ధి చేస్తామని వివరించారు. వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్ సమీపంలోని ఉనికిచర్ల వద్ద లావుని పట్టాదారుల భాగస్వామ్యంతో 145 ఎకరాల్లో పూర్తి స్థాయి వసతులతో కూడిన ‘యూని సిటీ’ మోడల్ లేఅవుట్ పనులు వేగంగా జరుగుతున్నట్లు చైర్మన్ తెలిపారు. రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలతో కూడిన ఈ లేఅవుట్ పట్టణ అభివృద్ధిలో ఒక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు.అక్రమ లేఅవుట్‌ల బారిన పడి ఇబ్బందులు పడకుండా, ప్రభుత్వ సంస్థ అయిన కుడా ద్వారా భూములను అభివృద్ధి చేసుకోవడం వల్ల అటు యజమానులకు, ఇటు ప్లాట్లు కొనుగోలు చేసే వారికి రక్షణ ఉంటుందని వారు ఈ సందర్భంగా గుర్తుచేశారు.






గడ్డం కేశవమూర్తి
Cell:9390101862

# లక్ష్యం ప్రజాసేవ.. మార్గం మానవీయత











**రాజకీయం అంటే కొందరికి అధికారం.. కానీ ఆయనకు అది ప్రజాసేవకు ఒక అద్భుతమైన వేదిక. చేతికి అందిన ప్రభుత్వ ఉద్యోగాన్ని తృణప్రాయంగా వదిలేసి, శూన్యం నుంచి వేల ఎకరాల రియల్ ఎస్టేట్ సామ్రాజ్యాన్ని నిర్మించిన అసాధారణ ప్రస్థానం ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ అధినేత శ్రీనివాస్ రెడ్డిది. వ్యాపార రంగంలో శిఖరాగ్రాన నిలిచినా, తన మూలాలను మర్చిపోకుండా సామాన్యుల కష్టాల్లో పాలుపంచుకుంటూ ఆయన సాగిస్తున్న సేవా యాత్ర నేటి తరం నాయకులకు ఒక దిక్సూచిగా నిలుస్తోంది. కేవలం లాభాల వేటలో పడకుండా, పుట్టిన గడ్డపై ఉన్న మమకారంతో ఆయన చేపడుతున్న వినూత్న కార్యక్రమాలు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి.**



- **శ్రీనివాస్ రెడ్డి స్ఫూర్తిదాయక ప్రస్థానం**
- **వ్యాపారవేత్తగా విజయం**
- **'ఎస్ఆర్ఆర్' ఫౌండేషన్ తో సేవలు**
- **ఉద్యమకారుడిగా పోరాటం**

శ్రీనివాస్ రెడ్డిలోని సేవా దృక్పథం, సామాజిక స్పృహ వెనుక ఒక గొప్ప నేపథ్యం ఉంది. ఆయన తండ్రి కేవలం రైతు మాత్రమే కాదు, అప్పట్లో గుర్తింపు పొందిన ఒక గొప్ప కళాకారుడు కూడా. నాటక రంగంలో ఆయన చేసిన కృషికి గానూ ప్రముఖ నటుడు తనికెళ్ల భరణి వంటి దిగ్గజాల నుంచే ప్రశంసలు అందుకున్న ప్రతిభాశాలి. రాయపర్తి, తొర్రూరు ప్రాంతాల్లో అప్పట్లో 30 ఎకరాల వ్యవసాయం, వ్యాపారాలు కలిగి ఉన్నప్పటికీ.. ఆయన కళాకారుల పట్ల, సమాజం పట్ల అత్యంత గౌరవంగా ఉండేవారు. సొంత ధనాన్ని ఖర్చు చేస్తూ, గ్రామాల్లో స్టేజీలు ఏర్పాటు చేసి నాటకాలు ప్రదర్శించి ప్రజల్లో చైతన్యం నింపేవారు. తండ్రి సాగించిన ఆ 'నిస్వార్థ సేవ', 'సామాజిక బాధ్యత'ను చిన్నతనం నుండే చూస్తూ పెరిగిన శ్రీనివాస్ రెడ్డి, నేడు తన వ్యాపార సామ్రాజ్యం ద్వారా అదే బాధ్యతను మరింత వేగంగా ముందుకు తీసుకెళ్తున్నారు.

## ఆశయమే.. శిఖరాగ్రానికి చేర్చింది..

చాలామంది ఒక ప్రభుత్వ ఉద్యోగం వస్తే జీవితం స్థిరపడిందని భావిస్తారు. కానీ, శ్రీనివాస్ రెడ్డి ఆలోచనలు వేరు. చదువు పూర్తి కాగానే పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో ప్రభుత్వ ఉద్యోగం వచ్చినప్పటికీ, అది తన ఆశయాలకు, సమాజానికి చేయాలనుకున్న సేవకు సరిపోదని ఆయన భావించారు. అందుకే, కేవలం రెండేళ్లలోనే ఆ స్థిరమైన ఉద్యోగానికి రాజీనామా చేసి, వ్యాపార రంగంలోకి అడుగుపెట్టారు. అప్పట్లో కేవలం రెండు ఎకరాలతో అతి సామాన్యంగా మొదలైన ఆయన రియల్ ఎస్టేట్ ప్రస్థానం, నేడు ఒక మహా సామ్రాజ్యంగా ఎదిగింది. తనదైన వ్యూహాలు, నమ్మకంతో ఎస్ఆర్ఆర్ గ్రూప్ పేరుతో సుమారు 2000 ఎకరాల భారీ ప్రాజెక్టులను, 25కు పైగా సక్సెస్‌ఫుల్ వెంచర్లను పూర్తి చేసి రియల్ ఎస్టేట్ దిగ్గజంగా నిలిచారు. పట్టుదల ఉంటే శూన్యం నుంచి అద్భుతాలు సృష్టించవచ్చని శ్రీనివాస్ రెడ్డి తన విజయంతో నిరూపించారు.

## పాతికేళ్ల సేవా యజ్ఞం..

వ్యాపారంలో ఆర్జించిన లాభాలను సమాజానికి తిరిగి ఇవ్వాలనే ఉన్నతమైన ఆశయంతో గత 25 ఏళ్లుగా నిరంతరాయంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ అధినేత శ్రీనివాస్ రెడ్డి. ఆయన సేవలు కేవలం ఒక ప్రాంతానికే పరిమితం కాకుండా తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా విస్తరించాయి. శ్రీనివాస్ రెడ్డికి ఆధ్యాత్మికతపై ఉన్న మక్కువతో ఇప్పటివరకు తెలుగు రాష్ట్రాల్లో సుమారు 25 దేవాలయాలను సొంత ఖర్చులతో నిర్మించారు.కోవిడ్ విపత్తు సమయంలో ప్రజలు అల్లాడుతున్న వేళ, సుమారు 10 వేల కుటుంబాలకు 12 రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేసి వారి ఆకలి తీర్చారు. ఆయన సేవలను గుర్తించి అప్పటి కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకోవడమే కాకుండా, స్వయంగా రాష్ట్రపతి కార్యాలయం నుంచి కూడా ప్రశంసలు, గుర్తింపు లభించడం విశేషం. అలాగే, అప్పటి గవర్నర్ సౌందర్య రాజన్ చేతుల మీదుగా మహాత్మ గాంధీ పురస్కారం అందుకున్నారు. ములుగు జిల్లాలో సంభవించిన వరదల సమయంలో ప్రస్తుత మంత్రి సీతక్కతో కలిసి రెండు రోజుల పాటు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి, బాధితులకు నిత్యావసర వస్తువులను అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. కేవలం సంపాదనకే ప్రాధాన్యత ఇవ్వకుండా, కష్టాల్లో ఉన్న ప్రతి ఒక్కరికీ నేనున్నానంటూ భరోసా కల్పిస్తున్న శ్రీనివాస్ రెడ్డి సేవలు నేటి తరం నాయకులకు, వ్యాపారవేత్తలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి.

## ఉద్యమ కెరటం శ్రీనివాస్ రెడ్డి ..

శ్రీనివాస్ రెడ్డి అంటే కేవలం ఒక వ్యాపారవేత్త, సేవావాది మాత్రమే కాదు.. మలిదశ తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలకు తెగించి పోరాడిన నిఖార్సైన ఉద్యమకారుడు. తెలంగాణ చరిత్రలో నిలిచిపోయే మిలియన్ మార్చ్, సాగరహారం, చలో ఉస్మానియా వంటి ఉత్కంఠభరిత కార్యక్రమాలలో ఆయన చురుగ్గా పాల్గొన్నారు. మిలియన్ మార్చ్ సందర్భంగా పోలీసుల లాఠీ దెబ్బలకు గురై తీవ్రంగా గాయపడినప్పటికీ, వెనకడుగు వేయకుండా పోరాడారు. ఈ క్రమంలోనే అరెస్ట్ అయి, చంచల్‌గూడ జైలులో కఠిన కారాగార శిక్షను కూడా అనుభవించారు. తెలంగాణ సిద్ధించే వరకు ఉద్యమ నాయకత్వానికి వెన్నంటే ఉండి.. వంటా-వార్పు, ధూమ్-ధామ్ వంటి నిరసన కార్యక్రమాల్లో కార్యకర్తలను సమన్వయం చేస్తూ ఉద్యమాన్ని ఉధృతం చేశారు. తన ప్రాంత అభివృద్ధి, ఆత్మగౌరవం కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధమనే తత్వాన్ని ఆనాడే నిరూపించుకున్నారు. శ్రీనివాస్ రెడ్డి కేవలం నాయకుడే కాదు, ఒక ఉద్యమకారుడు కూడా.

## రాజకీయ ప్రస్థానం..

శ్రీనివాస్ రెడ్డి రాజకీయ ప్రయాణం ఒక ఆసక్తికరమైన మలుపు తిరిగింది. దశాబ్దాలుగా ప్రజాసేవలో ఉంటూ, రాజకీయంగా తనదైన ముద్ర వేయాలని భావించిన ఆయనకు తొలుత కాంగ్రెస్‌లో చేదు అనుభవాలు ఎదురయ్యాయి. పార్టీ కోసం అహర్నిశలు శ్రమించినా, స్థానిక నాయకత్వం నుంచి సరైన గుర్తింపు లభించకపోవడంతో ఆయన అసంతృప్తికి లోనయ్యారు. శ్రీనివాస్ రెడ్డి సేవా నిబద్ధతను, ఆయనకున్న ప్రజాదరణను గుర్తించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఆయన గురించి మాజీ సీఎం కేసీఆర్ కి వివరించారు. ఒక సామాన్య నాయకుడిగా కాకుండా, వేలాది కుటుంబాలకు అండగా నిలిచిన వ్యక్తిగా ఆయనను గౌరవిస్తూ కేసీఆర్ స్వయంగా తన నివాసానికి ఆహ్వానించారు. సుమారు 45 నిమిషాల పాటు ప్రత్యేకంగా చర్చించి, శ్రీనివాస్ రెడ్డి సేవలను కొనియాడుతూ గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కేసీఆర్ ఇచ్చిన ఆ భరోసాతో ప్రస్తుతం ఆయన బీఆర్ఎస్ పార్టీలో కీలక నేతగా కొనసాగుతున్నారు.



## రైతు సంక్షేమమే లక్ష్యం..

ఆసియాలోనే అతిపెద్ద వ్యవసాయ మార్కెట్ అయిన ఏనుమాముల మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి వస్తే తద్వారా రైతులకు ప్రత్యక్షంగా సేవ చేయాలనేది శ్రీనివాస్ రెడ్డి ప్రధాన ఆశయం. "రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే నా ప్రథమ కర్తవ్యం. దళారుల చేతుల్లో అన్నదాతలు మోసపోకుండా, పండించిన ప్రతి గింజకు సరైన ధర అందేలా శాయశక్తులా కృషి చేస్తాను" అని ఆయన ధీమా వ్యక్తం చేస్తున్నారు. సమాజంలో వస్తున్న మార్పులను గమనిస్తున్న శ్రీనివాస్ రెడ్డి ప్రజలకు ఒక కీలక విన్నపం చేస్తున్నారు. "ఎన్నికల సమయంలో డబ్బుకు ఆశపడి ఓటు వేయడం అంటే మన భవిష్యత్తును మనమే నాశనం చేసుకోవడం. నోటుకు ఓటు వేస్తే న్యాయం జరగదు. డబ్బు పెట్టి గెలిచిన వాడు సంపాదన పైనే దృష్టి పెడతాడు తప్ప సేవ చేయడు. నిజాయితీగా పని చేసే నాయకులను ఆదరించండి" అని ఆయన పిలుపునిచ్చారు.

## బయోడేటా

పేరు : పరుపాటి శ్రీనివాస్ రెడ్డి
తండ్రి: యాదవ రెడ్డి
తల్లి: సరోజన
భార్య: స్వప్న రాణి
పెద్ద కూతురు: జస్మిత రెడ్డి
చిన్న కూతురు: తేజస్విని
వృత్తి : రియల్ ఎస్టేట్ వ్యాపారం
చదువు: డిగ్రీ

వరంగల్ వాయిస్ Evening Daily
GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
బుధవారం, జనవరి 21, 2026




# స్థానిక సమస్యలు పరిష్కరించాలి

## బల్దియా ఎదుట ఎంసీపీఐయూ ఆధ్వర్యంలో ధర్నా

**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలో పేరుకుపోయిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఎంసీపీఐయూ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రధాన ద్వారానికి అడ్డుగా బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంసీపీఐయూ వరంగల్ నగర కార్యదర్శి మాలోత్ సాగర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లలో ఎంసీపీఐయూ వరంగల్ నగర కమిటీ ఆధ్వర్యంలో గత 15 రోజులుగా సర్వే చేయగా అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయన్నారు. వీటిని పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ముంపు ప్రాంతాల్లో స్వయంగా ముఖ్యమంత్రి పర్యటించి వరదలతో నష్టపోయిన కుటుంబాలకు పరిహారం చెల్లిస్తానంటూ ప్రకటించి మూడు నెలలు కావస్తున్నా ఇప్పటికీ ఏ ఒక్కరికి కూడా నష్టపరిహారం అందలేదన్నారు.

నగరంలో కోతులు, కుక్కల బెడద తీవ్రంగా ఉందని, ప్రజల భయాందోళనకు గురవుతున్నారన్నారు. సైడ్ కాలువలు, డ్రైనేజ్ సమస్యలు, అంతర్గత రోడ్ల మరమ్మత్తులకు చర్యలు చేపట్టాలన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసినా బిల్లులను మాత్రం చెల్లించకపోవడం సిగ్గుచేటన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంసీపీఐయూ వరంగల్ నగర కార్యదర్శి వర్గ సభ్యులు నర్రా ప్రతాప్, ముక్కెర రామస్వామి, ఎగ్గని మల్లికార్జున్, మాలోత్ ప్రత్యూష, జిల్లా కమిటీ సభ్యులు ఎ.నరసయ్య, మాలి ప్రభాకర్, కనకం సంధ్య, ఖిలా వరంగల్, రంగశాయిపేట, కరీమాబాద్, కాశిబుగ్గ, మిడిల్ ఏరియా కార్యదర్శులు సుంచు జగదీష్, ఐతమ్ నగేష్, గనపాక ఓదెల్, పెరుమల్ల గోవర్ధన్, ఎండి మహబూబ్ పాషా, శాఖ కార్యదర్శులు పూలమ్మ, ఆశా బేగం, రాజల్ల, లలిత, నాయకులు ప్రశాంత్, యాకయ్య, రాజు, మానస లక్ష్మి, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మోడ్రన్ స్టేషన్‌గా తీర్చిదిద్దాలి

- హనుమకొండ బస్టాండ్ ఆధునీకరణ పనులు చేపట్టాలి
- మంత్రి పొన్నంకు ఇనగాల వినతి



**వరంగల్ వాయిస్, హనుమకొండ/ హైదరాబాద్ :** చారిత్రక హనుమకొండ నగరంలోని పాత బస్టాండ్‌ను అన్ని హంగులతో కూడిన మోడ్రన్ బస్ స్టేషన్‌గా మార్చాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు ఇనుగాల వెంకట్రాంరెడ్డి బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సలహా మేరకు ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా ఇనుగాల వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ.. హనుమకొండ బస్టాండ్‌ను సుమారు రూ.80 కోట్ల స్మార్ట్ సిటీ నిధులతో మల్టీ పర్పస్ సెంటర్‌గా (షాపింగ్ కాంప్లెక్స్, మల్టీప్లెక్స్‌తో కలిపి) అభివృద్ధి చేయాలనే ప్రతిపాదనలు గతంలోనే ఉన్నాయని మంత్రికి వివరించారు. ఈ పనులను తక్షణమే వేగవంతం చేసి, ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించాలని కోరారు. ప్రస్తుతం ఉన్న బస్టాండ్ భవనం పాతబడటంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీనిని నవీకరిస్తే నగర రూపురేఖలు మారడంతో పాటు ప్రయాణికులకు ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. దీనిపై మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. ఈ ప్రతిపాదనలను పరిశీలించి తదుపరి చర్యలు వేగవంతం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.



# మట్టి దిబ్బల తొలగింపు

**వరంగల్ వాయిస్, చింతల్ :** నగరంలోని 36వ డివిజన్ చింతల్ బ్రిడ్జిపై నడకదారిలో గత రెండు రోజులుగా మట్టి దిబ్బలను తొలగించకపోవడంతో జరుగుతున్న ప్రమాదాలపై సామాజికవేత్త, సుస్మిత గార్డెన్ యజమాని, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఎల్. శ్రీనివాస్ స్పందించారు. ఉదయం వాకింగ్ కు వెళ్లే వారికి మట్టి దిబ్బలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. విషయాన్ని బల్దియా అధికారుల దృష్టికి తీసుకుపోవడంతో బుధవారం కార్పొరేషన్ సిబ్బంది అక్కడికి చేరుకొని మట్టిదిబ్బలను తొలగించారు.

# పద్మశాలీల ఆరాధ్య దైవం శ్రీ భక్త మార్కండేయ

## ఘనంగా జయంతి వేడుకలు




**వరంగల్ వాయిస్, రెడ్డికాలనీ :** పద్మశాలీల ఆరాధ్య దైవం శ్రీ భక్త మార్కండేయ అని పలువురు కొనియాడారు. హనుమకొండ రెడ్డి కాలనీ నాలుగో డివిజన్ లో బుధవారం శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శ్రీ మార్కండేయ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సంక్షేమ సంఘం అధ్యక్షులు భక్తుల రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శి వైద్యం రాజగోపాల్, వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు శ్రీధర్ తో పాటు పద్మశాలి కులస్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. శ్రీ భక్త మార్కండేయ జయంతిని పురస్కరించుకొని మహా అన్నదానం నిర్వహించారు. సుమారు 1000 మంది పద్మశాలీలు అన్నదానంలో భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమంలో గుర్రం రమేష్, నరెడ్ల మహేందర్, దుంపేటి నరేందర్ బాబు, కోమాకుల కుమారస్వామి, లింగ బత్తుల సత్తయ్య, బేతి రమేష్, గంజి రాజేందర్, చేరాల శ్రీధర్, గోరంటల రాజకుమార్, కూచన సురేష్, బత్తుల మహేందర్, కొంగ సారంగపాణి, కూరపాటి శ్రీనివాస్, కందగట్ల నరేష్, చెన్నూరి రాజు, దుంపేటి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధే లక్ష్యం

## ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే శ్రీహరి | పలు పనులకు శంకుస్థాపన



**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** స్టేషన్ ఘనపూర్ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి వెల్లడించారు. స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చాగల్ లోని 6,7,8,9 వార్డులలో రూ.4 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి బుధవారం వారు శంకుస్థాపన చేశారు. స్టేషన్ ఘనపూర్ లో రూ.3 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, గాంధీ విగ్రహం నుంచి బస్టాండ్, రైల్వే స్టేషన్ వరకు డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ నిర్మాణానికి, శివునిపల్లిలోని 2,3,4,5 వార్డులలో రూ.4 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి అలాగే మున్సిపాలిటీ పరిధిలో రూ.7 కోట్లతో వరద కాలువల నిర్మాణానికి మొత్తం రూ.18కోట్ల అభివృద్ధి పనులకు కడియం కావ్య, కడియం శ్రీహరి అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీలో మొదటి విడతలో రూ.7 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసుకున్నామని ఈ రోజు మరో రూ.18 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసుకున్నామన్నారు. ఈ పనులన్నింటినీ నెల రోజుల్లో పూర్తి చేసే విధంగా అధికారులు, కాంట్రాక్టర్లు చర్యలు చేపట్టాలన్నారు. మరో రూ. 25 కోట్లతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు మున్సిపల్ కార్యాలయం భవనం, టౌన్ హాల్, ఇంటిగ్రెటెడ్ మార్కెట్ వంటి పనులకు సైతం త్వరలోనే ప్రారంభిస్తామని అన్నారు. రూ.50 కోట్ల విలువైన ఈ పనులను పూర్తి చేయడమే కాకుండా మరొక రూ.50 కోట్ల నిధులకు ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేసినట్లు వెల్లడించారు. స్టేషన్ ఘనపూర్ అభివృద్ధిని చూసి ప్రజలు అండగా నిలవాలని కోరారు. అభివృద్ధి చేసే పార్టీకి మద్దతుగా నిలిస్తే మరింత అభివృద్ధి చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాధాకృష్ణ, మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE. EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com